క్లుప్తంగా

కంది విత్తనాలు పంపిణీ

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని అక్కచెరువు గ్రామంలో రైతులకు గురువారం దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదర్శ అపరాల పథకం కింద ఎల్ఆర్జీ–52 కంది రకం విత్తనాలు పంపిణీ చేశారు. కేవీకే శాస్త్రవేత్త టి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఎల్ఆర్జీ–52 రకం విత్తనాలు 160–170 రోజుల్లో కోతకొస్తుందని, ఎకరానికి 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశముందని చెప్పారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకానికి సంబంధించి వెబ్ ల్యాండ్‌లో రైతు ఖాతాకు ఆధార్ అనుసంధానం కాని వారు వెంటనే చేయించుకోవాలని ఏఓ శ్రీనివాసరెడ్డి సూచించారు.

భక్తి శ్రద్ధలతో పట్టాభిరాముడి ప్రతిష్ఠ ఉత్సవాలు

కొనకనమిట్ల: మండలంలోని మర్రిపాలెం బీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన పట్టాభిరామ స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి పూజ, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పలువురు ఉభయదాతలు కంకణాలు ధరించి హోమాల్లో పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎఫ్ఆర్ఓ



నూతన ఎఫ్ఆర్ఓను అభినందిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

మార్కాపురం: అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని మార్కాపురం అటవీ శాఖ నూతన ఎఫ్ఆర్ఓగా ఎస్.పిచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఆయన నెల్లూరు జిల్లా గోనుపల్లె సెక్షన్ డీఆర్ఓగా పనిచేస్తూ పదోన్నతిపై మార్కాపురం అటవీశాఖ ఎఫ్ఆర్ఓగా నియమితులయ్యారు. గురువారం బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నూతన ఎఫ్ఆర్ఓను డీఆర్ఓ నాగరాజు, సిబ్బంది ఖాజా రహ్మతుల్లా, ప్రసాద్‌రెడ్డి, రవికుమార్, బాలాకుమారి, ఏడుకొండలు, జాన్సన్, ధనుశ్రీ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

విద్యుత్ చౌర్యంపై రూ.3.17 లక్షల జరిమానా

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో స్థానిక ఏడీఈ బీవై శేషగిరిరావు ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముండ్లపాడు, బురుజుపల్లె, ఉయ్యాలవాడ, సంజీవరాయుడుపేట, తాళ్లపల్లె తదితర గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. మీటరు ఉండి, మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిని గుర్తించి మొత్తం రూ.3.17 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఏడీఈ వివరించారు. దాడుల్లో ముండ్లపాడు ఏఈ వెంకటేశ్వరావు, గిద్దలూరు ఏఈ నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్ పోటీలకు ఏపీటీడబ్ల్యూఆర్ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక కావటంపై ప్రిన్సిపాల్ పెంటన్న హర్షం వ్యక్తం చేశారు. గత నెల 31వ తేదీన యర్రగొండపాలెంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ధనరాజ్ నాయక్, మల్లికార్జున నాయక్‌లు చక్కటి ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 9,10,11వ తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలో జరుగుతాయని తెలిపారు. క్రీడాకారులను ఫిజికల్ డైరెక్టర్ తులసీ నాయక్, ప్రతాప్‌నాయక్‌లు అభినందించారు.

ఈ నెలా.. కంది పప్పు హుళక్కే!

- రేషన్ దుకాణాలకు పూర్తి స్థాయిలో సరఫరా కాని కంది పప్పు
- 500 కార్డులున్న దుకాణాలకు 150 ప్యాకెట్ల లోపే సరఫరా
- మార్కెట్‌లో కిలో కంది పప్పు రూ.140 పెట్టి కొనలేక పేదల అవస్థలు



కందిపప్పు ప్యాకెట్లు

మార్కాపురం:

రేషన్ దుకాణాల్లో కంది పప్పు పంపిణీకి ఇప్పట్లో మోక్షం లభించే పరిస్థితులు కానరావడం లేదు. ఈ నెలలో వరలక్ష్మి వ్రతం, వినాయక చవితి పండగలకూ పేదలు పప్పన్నం తినలేని దుస్థితి. కార్డుదారులు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కంది పప్పు కోసం ఆశగా ఎదురు చూస్తున్నా కూటమి ప్రభుత్వం మాత్రం రేషన్ దుకాణాలకు సరఫరా చేయడంలో మీన మేషాలు లెక్కిస్తోంది. ఈ ఏడాది క్వింటా కందుల ధర రూ.5 వేల నుంచి రూ.6 వేల లోపే ఉన్నపటికీ రేషన్ కార్డుదారులకు కంది పప్పు సక్రమంగా పంపిణీ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అదిగో ఇస్తాం.. ఇదిగో ఇస్తాం!

కంది పప్పు ఇవ్వాలని కోరిన కార్డుదారులకు వచ్చే నెలలో ఇస్తామంటూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి డీలర్లు సర్దిచెబుతూ వస్తుండటం గమనార్హం. క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై కూటమి ప్రభుత్వానికి అవగాహన ఉన్నప్పటికీ కంది పప్పు సరఫరా చేయకపోవడంపై కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈనెలలో ఒక్క మార్కాపురంలో మాత్రం గొడౌన్‌లో మిగిలిపోయిన కొంత కంది పప్పును కొన్ని షాపులకు అందించారు. పట్టణంలో 500 రేషన్‌కార్డులున్న చౌక ధరల దుకాణానికి కేవలం 125 నుంచి 150 ప్యాకెట్ల కంది పప్పు పంపిణీ చేశారు. దీంతో డీలర్లు ఆ కంది పప్పును గుట్టు చప్పుడు కాకుండా తమకు తెలిసిన కొందరు కార్డుదారులకు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. బయట మార్కెట్‌లో కిలో కంది పప్పు నాణ్యమైన రకాన్ని బట్టి 105 రూపాయల నుంచి రూ.160కు పైగా పలుకుతోంది. రేషన్ దుకాణాల్లో అయితే అదే కంది పప్పు 67 రూపాయలకు కార్డు దారులకు లభిస్తుంది. దీంతో పేదలంతా రేషన్ దుకాణాల్లో ఇచ్చే కంది పప్పు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

మార్కాపురం నియోజకవర్గంలో ఇలా...		
మండలం	రేషన్ దుకాణాలు	తెల్ల రేషన్ కార్డులు
మార్కాపురం	62	33,378
తర్లుపాడు	19	9,992
పొదిలి	37	18,650
కొనకనమిట్ల	30	14,971
మొత్తం	148	76,991

అరకొర కేటాయింపులతో సరి

మార్కాపురం పౌరసరఫరాల శాఖ గోడౌన్ పరిధిలో మార్కాపురం, తర్లుపాడు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాలు ఉన్నాయి. ప్రతి నెలా ఈ మండలాల్లోని రేషన్ షాపులతోపాటు దొనకొండలో 8 షాపులు, కొనకనమిట్లలో 6 షాపులు వెరసి మొత్తం 150 దుకాణాలకు 78 టన్నుల కందిపప్పు రావాల్సి ఉంది. అయితే ప్రభుత్వం అందులో పావు శాతం మాత్రమే సరఫరా చేసింది.

అందరికీ కంది పప్పు ఇవ్వాలి



రేషన్ కార్డుదారులకు పూర్తి స్థాయిలో ప్రభుత్వం కందిపప్పు పంపిణీ చేయాలి. బయట మార్కెట్‌లో కేజీ కంది పప్పు రూ.100 నుంచి 150 రూపాయలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో కేజీ 67 రూపాయలకు ఇస్తే ఒక్కో కార్డుదారుడికి రూ.33 నుంచి 43 రూపాయల వరకు ఆదా అవుతుంది. ప్రభుత్వం సబ్సిడీపై ఈ నెల నుంచైనా కందిపప్పు అందించాలి.

– ఓప మల్లిక్, జిల్లా వినియోగదారుల సంఘ గౌరవ అధ్యక్షుడు

సామాన్యులకు సంక్షేమం దూరం

- కూటమి పాలనలో ఒక్క పథకమూ సక్రమంగా అమలు చేయలేదు
- చంద్రబాబు మోసపూరిత మేనిఫెస్టోపై ప్రజల్లో విస్తృతంగా చర్చ
- వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి



మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు

కొమరోలు: కూటమి ప్రభుత్వంలో సామాన్య ప్రజానీకానికి సంక్షేమ పథకాలు అందడం లేదని వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి విమర్శించారు. కొమరోలులో జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు ఆధ్వర్యంలో గురువారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి గ్రామ పంచాయతీల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమస్యలపై చర్చించారు. అనంతరం పార్టీ శ్రేణుల సమావేశంలో కేపీ మాట్లాడుతూ.. గడిచిన 14 నెలలుగా కూటమి ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. సంక్షేమ పథకాలు ఇస్తున్నట్లు గొప్పలు చెప్పడమే తప్ప అర్హులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ పథకాలకు వేలాది మంది విద్యార్థులు, రైతులు, మహిళలు దూరమయ్యారన్నారు. సాంకేతిక కారణాలు చూపి లబ్ధిదారుల సంఖ్యలో కోత పెట్టేందుకు కూటమి ప్రభుత్వం యత్నించడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అర్హులైన వ్యక్తులకు ప్రతి పథకం అందేలా గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా అప్పటి సీఎం వైఎస్ జగన్ చర్యలు చేపట్టడంతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరిసిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బైబిల్, ఖురాన్, భగవద్గీతలా భావించి సంక్షేమ పథకాలు అమలు చేశారని, అధికారం చేపట్టిన ఏడాదిలోపే దాదాపు అన్ని హామీల అమలును ప్రారంభించారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా హామీలు అమలు చేయకపోగా అర్హులకు అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపు మేరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని సామాన్యులకు వివరిస్తున్నట్లు తెలిపారు. కూటమి మోసపూరిత మేనిఫెస్టోపై ప్రతి గ్రామంలో ఇప్పటికే విస్తృతంగా చర్చ నడుస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రవికుమార్, జేసీఎస్ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ షేక్ మౌలాలి, ఎంపీటీసీ సభ్యులు షేక్ సుభాని, తిరుపతిరాజు, నాయకులు వెంగయ్యచౌదరి, చెదుళ్ల రమణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, శిరీష, బంగారు విశ్వరూపం తదితరులు పాల్గొన్నారు

మార్కాపురంలో ఇసుక దోపిడీ అరికట్టండి

- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి



మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు వినతి పత్రం అందిస్తున్న లారీ అసోసియేషన్ నాయకులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఇసుక దోపిడీని అరికట్టేందుకు కృషి చేయాలని, ప్రజలపై కాంట్రాక్టర్ మోపుతున్న అదనపు భారాన్ని తగ్గించేలా చూడాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు గురువారం రాత్రి లారీ ఓనర్స్ అసోసియేషన్ మార్కాపురం కమిటీ సభ్యులు వినతి పత్రం ఇచ్చి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు ఉచితంగా ఇసుక ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేశారని, మార్కాపురం పరిధిలో ఇసుక రీచ్ లేనందున నెల్లూరు నుంచి రవాణా చేస్తున్నారన్నారు. మార్కాపురంలో ఇసుక కాంట్రాక్ట్‌ను గొట్టిపాటి సురేంద్ర అనే వ్యక్తికి అప్పగించారని, ఆయన టన్ను ఇసుక రూ.950 ప్రకారం రవాణా చేయాలని కోరినందున ఒప్పందం మేరకు తోలామన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి టన్నుకు రూ.800 మాత్రమే ఇస్తామని చెప్పారని, దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. సదరు కాంట్రాక్టర్ మాత్రం ప్రజల నుంచి టన్ను రూ.1250 ప్రకారం తీసుకుంటున్నారని, ట్రాక్టర్‌కు అయితే టన్ను రూ.1350 ప్రకారం వసూలు చేస్తున్నారని వివరించారు. యార్డ్‌లో ఇసుక అమ్మకపోతే అసోషియేషన్ తరఫున ప్రజలకు టన్ను రూ.950 చొప్పున తాము అందిస్తామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉచిత ఇసుక అని ప్రజలను నమ్మించి కాంట్రాక్టర్లు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. తాము రూ.800కు ఇసుక సరఫరా చేయలేమని, తమ సమస్యను ఈనెల 15వ తేదీలోగా పరిష్కరించక పోతే లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు. తమ సమస్యపై కలెక్టర్, సబ్ కలెక్టర్, మార్కాపురం డీఎస్పీ, మైన్స్ అధికారులకు లిఖితపూర్వకంగా వినతిపత్రాలు పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బి.కాశీరామ్ సింగ్, బాలాజీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



శివ మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మార్కాపురం: అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్న పెద్దదోర్నాల మండలం చిన్నగుడిపాడు గ్రామానికి చెందిన కౌలురైతు నాలి శివ కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల రూపాయల నష్టపరిహారాన్ని ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా నాయకుడు దగ్గుబాటి సోమయ్య డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న కౌలురైతు శివ మృతదేహాన్ని గురువారం స్థానిక జీజీహెచ్‌లో సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిట్టుబాటు ధరలు లేకపోవడం, అప్పులు పెరగడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. రైతులను ఆదుకునే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేయడం లేదని, గిట్టుబాటు ధరలను కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పు తీసుకుని వ్యవసాయం చేయడం వల్ల వడ్డీ పెరిగి బాకీ చెల్లించలేని స్థితిలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలి శివ గత పదేళ్ల నుంచి వ్యవసాయం చేస్తూ ఆదాయం లేక చేసిన అప్పులు రూ.25 లక్షలకు చేరడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జి.బాలనాగయ్య, తిరుపతిరెడ్డి, రూబెన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి



కంభంలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



బేస్తవారిపేటలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సలోమీ



గోగులదిన్నెలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

బేస్తవారిపేట/కంభం/అర్ధవీడు: బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సలోమీ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు, కంభం పట్టణంలోని 68వ, 6వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆరు నెలల వయసు వరకు శిశువుకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఆహారంలో ఆకుకూరలు, గుడ్లు, పాలు తీసుకోవడం వల్ల రక్తహీనత బారిన పడకుండా ఉండవచ్చని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో డాక్టర్ స్వాతి, ఏఎన్ఎం ఝాన్సీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అర్ధవీడు ఐసీడీఎస్ సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ డి.రమీజాబీ మాట్లాడుతూ.. ప్రసవించిన రోజు నుంచి తల్లి పాలు ఇవ్వడం ద్వారా బిడ్డలు ఎలాంటి అనారోగ్య సమస్యలైనా తట్టుకోగలరని తెలిపారు.

మార్కాపురం టౌన్: నవజాత శిశువులకు తల్లిపాలే శ్రీరామరక్ష అని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. గురువారం గోగులదిన్నె అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల్లో మానసిక వికాసానికి, వ్యాధి నిరోధక శక్తిని పెంచేందుకు ముర్రుపాలు ఉపకరిస్తాయని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ షేక్ నీలోఫర్, మహిళా పోలీస్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం విజయ, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న డీఈఓ

- డీఈఓ కిరణ్‌కుమార్

పొదిలి రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని డీఈఓ ఎ.కిరణ్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం పొదిలి సెయింట్ మేరీ బీఈడీ కళాశాలలో ఉన్నత పాఠశాలలు, మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో 906 మంది ప్రధానోపాధ్యాయులకు 4 రోజుల చొప్పున మూడు విభాగాల్లో పాఠశాల నాయకత్వంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను అమలు చేస్తూ తోటి ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి డి.నాగరాజు, క్యాంప్ కోఆర్డినేటర్లు మర్రిపూడి, కొనకనమిట్ల ఎంఈఓలు రంగయ్య, నరసింహరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మార్కాపురంలో మధ్యాహ్నం వేళ ఎండ



సాయంత్రం పూట కురుస్తున్న వర్షం

ఉదయం ఎండ.. సాయంత్రం వర్షం!

మార్కాపురం: మార్కాపురంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకావడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. గత వారంరోజుల నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. అయితే గురువారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఒక్కసారిగా దట్టమైన మేఘాలు కమ్ముకొని ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ దెబ్బకు విలవిల్లాడిన జనానికి వర్షం కాస్త ఉపశమనం కలిగించినట్లయింది. అక్కడక్కడా సాగుచేసిన పత్తి, జొన్న, సజ్జ పైర్లకు ఈ వర్షం ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా గత పది రోజులుగా వర్షాలే లేకపోవడంతో పత్తి విత్తనాలు నాటిన రైతులు మొలకలు సరిగ్గా రాక ఆందోళన చెందుతున్నారు.

కుక్కల బెడదతో హడల్!



తర్లుపాడు రోడ్డులో రాత్రి వేళ గుంపుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో కుక్కల బెడద తీవ్రంగా ఉండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. చీకటి పడగానే నడిచి వెళ్లేవారు, వాహనదారులను కుక్కలు వెంటాడుతుండటంతో తప్పించుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు. కుక్కల బెడదను నివారించాలని మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గంజాయి నిందితులు త్వరలో అరెస్టు

పొదిలి రూరల్: పొదిలిలో గంజాయి వ్యాపారం చేసే వ్యక్తులను గుర్తించామని, త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్సై వేమన చెప్పారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. పొదిలి పరిసర ప్రాంతాలలో గంజాయి అమ్మేవారు, సరఫరా చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. అలాగే పొదిలి ప్రధాన రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.